నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, శుక్రవారం 28 ఫిబ్రవరి 2025 | MAHABUBNAGAR NARAYANPET

మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్‌ఎస్ నేతలు

ఆదరాబాదరతోనే.. కుప్పకూలింది

- ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దునిద్ర వీడాలి
- దోమల పెంట ఎస్‌ఎల్‌బీసీ సహాయ చర్యల్లో వేగం పెంచాలి
- మంత్రులు, సహాయ బృందాల మాటలకు పొంతనే లేదు
- కాంగ్రెస్ 14 నెలల పాలనలో కూలిన నాలుగు ప్రాజెక్టులు
- మీడియాతో మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

మహబూబ్‌నగర్, (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/అచ్చంపేట, ఫిబ్రవరి 27 : కాంగ్రెస్ ప్రభుత్వం ఆదరాబాదరగా ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ చేపట్టడంతోనే కుప్పకూలిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. సొరంగంలో 8 మంది కార్మికులు చిక్కుకొని ఆరు రోజులైనా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. గురువారం దోమల పెంట సమీపంలోని ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌ను బీఆర్‌ఎస్ ప్రతినిధులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఓ పక్క ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో ప్రమాదం చోటు చేసుకుంటే.. మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డి ఎలక్షన్ ప్రచారంలో బిజీగా ఉన్నారని చురకలంటించారు. ముఖ్యమంత్రి రాక పోకడంతో సహాయక చర్యల్లో ఒక్క డైరెక్షన్ సక్రమంగా లేదని విమర్శించారు. మంత్రులేమో పొద్దున్నే వస్తారు.. సాయంత్రానికి వెళ్తున్నారు.. ఘటన జరిగి ఇన్ని రోజులైనా కార్మికులు చిక్కుకున్నా.. వారిని సురక్షితంగా తీసుకురావాలన్న చిత్తశుద్ధి ఈ ప్రభుత్వానికి ఉందా..? అని ఆయన ప్రశ్నించారు. టన్నెల్‌లో కన్వేయర్ బెల్టు పనిచేస్తలేదు.. రిపేర్ చేయడానికి టైం పడ్తుందంట.. చెప్పేటోళ్లు ఎవరూ లేరు.. టీబీఎంపై రాళ్లు పడి.. డీబ్రీజ్‌తో చెల్లాచెదరైంది.. అది కట్ చేస్తేనే లోపలి బురద బయటకు వచ్చే అవకాశం లేదన్నారు. త్వరగా నిర్ణయం తీసుకొని మరింత త్వరగా డీవాటరింగ్ చేయాలన్నారు. కన్వేయర్ బెల్ట్ గురించి ఎన్‌డీఆర్‌ఎఫ్, ఇతర బృందాలతో, కంపెనీ ప్రతినిధులతో మాట్లాడినమన్నారు. వారు చెప్పే మాటలకు.. మంత్రులుచెప్పే జోలికి పొంతన లేదని విమర్శించారు. టన్నెల్లోకి వెళ్లి పరిశీలిస్తామంటే మమ్మల్ని అడ్డుకున్నారన్నారు. మంత్రి ఉత్తమ్ అంటుండు.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఈ ప్రాజెక్టు కూలి పోయిందంటుండు.. ప్రస్తుతం జరిగిన ప్రమాదానికి.. నాటి ప్రభుత్వానికి ఏమైనా సంబంధం ఉందా.. అని ప్రశ్నించారు. రైల్వే టీం ఉంది.. అక్కడ సింగరేణి టీం ఉంది.. ఎన్‌డీఆర్‌ఎఫ్ ఉంది.. ఆర్మీ, నేవీ, ర్యాట్ మైనర్స్ టీం మొత్తంగా చూస్తా ఉంటే అక్కడ బృందాల మధ్య సమన్వయం సాధించడంలో ప్రభుత్వం పూర్తిగా ఫెయిల్ అయిందని విమర్శించారు. నాటి కాంగ్రెస్ హయాంలో ఈ ప్రాజెక్టుకి రూ.3,300 కోట్లు కేటాయిస్తే.. కేసీఆర్ ప్రభుత్వంలో రూ.3,900 కోట్లు కేటాయించామని, ఎక్కువగా.. రూ.600 కోట్లు కేటాయించామన్నారు. మంత్రి జూపల్లి మేము 5 కి.మీ. చేశామని చెబుతుండు.. 12 కి.మీ. పని చేస్తే ఆయన మా ప్రభుత్వంలో మంత్రిగా ఉండి నాతోపాటు ఇక్కడికి వచ్చి పనులు చూసి సమీక్ష నిర్వహించారు.. ఇప్పుడు మాట మార్చిండు.. అని దుయ్యబట్టారు. ఇప్పటికైనా సమన్వయంతో సహాయక చర్యలుచేపట్టాలని సూచించారు. నిపుణుల సలహాలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఆయనవెంట మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీలు కోటిరెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే విజయుడు, బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, గువ్వల బాలరాజు, బీరం హర్షవర్ధన్ రెడ్డి, కంచర్ల రాంభూపాల్‌రెడ్డి, మాజీ కార్పొరేషన్ల చైర్‌పర్సన్ రజిని సాయిచంద్, చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, కురువ విజయ్ కుమార్, నాయకులు ఉన్నారు.

మంత్రులు వచ్చిపోతున్నారు.. ఇదేమైనా టూరిజం స్పాటా?

ఎస్‌ఎల్‌బీసీ ప్రమాద ఘటనలో చిక్కుకున్న వారికి కాపాడేదుకు వచ్చిన రెస్క్యూ బృందాలకు ఆరు రోజుల వరకు డైరెక్షన్ ఇవ్వకుండా ఎవరు ఏ పని చేయాలి చెప్పకుండా మంత్రులు టూరిజం స్పాట్‌కు వచ్చినట్లుగా హెలికాప్టర్‌లో ఉదయం వచ్చి సాయంత్రం తిరిగి వెళ్తున్నారని, సొంత జిల్లా అని చెప్పుకునే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎనిమిది మంది ప్రాణాలు ముఖ్యమా..? ఎన్నికల ప్రచారం, ఢిల్లీ పర్యటనలు ముఖ్యమా..? అంటూ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. గురువారం ఆయన మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీలు నవీన్‌రెడ్డి, కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, మర్రి జనార్దన్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్, రాష్ట్ర గిడ్డంగుల మాజీ చైర్‌పర్సన్ రజనీ సాయిచంద్‌తో కలిసి బీఆర్‌ఎస్ బృందం దోమల పెంటలో ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో చోటుచేసుకున్న ప్రమాదస్థలిని పరిశీలించి, కార్మికులు, బాధిత కుటుంబాలను కలిసి మనోధైర్యం కల్పించి, ప్రభుత్వానికి సలహాలు సూచనలు చేసేందుకు వచ్చారు. ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ సందర్శన అనంతరం తిరిగి వెళ్తుండగా పక్కనే షెడ్డులో నివాసం ఉంటున్న కార్మికుల వద్దకు వెళ్లారు. సొరంగంలో చిక్కుకున్న వారి బంధువులను పరామర్శించారు. ఘటనలో త్రుటిలో తప్పించుకున్న వారితో మాట్లాడారు. ప్రమాదం జరిగిన ఒకరోజు ముందు సొరంగంలోకి వెళ్లిన మాకు పైనుంచి మట్టి, రాళ్లు కిందపడుతూ భారీగా నీటి ఊట వచ్చిందన్నారు. ఈ సమయంలో పనులు చేస్తే ప్రమాదమని తెలిసి కూడా మమ్మల్ని లోపలికి పంపించారు. సుమారు 50మందిని 12 కిలో మీటర్ల దూరం పంపించి అక్కడి నుంచి రెండు కిలోమీటర్లు నడిపించి టీబీఎన్ మెషిన్లు ఆన్ చేశారు. కొద్దిసేపట్లోనే మిషన్‌పై రాళ్లు, మట్టి పడి నీటి ఊట బయటికి వచ్చింది. మిషన్ 80మీటర్లు వెనక్కి వచ్చింది. దీంతో తామంతా భయపడి పారిపోయాం. కొంతమంది తొక్కిసలాటలో కిందపడి అక్కడే చిక్కుకున్నారు. మిషన్ ఆపరేటర్లు, ఇంజినీర్లు కూడా ఈ ఘటనలో లోపలే ఉండిపోయారని, తాము మాత్రం ప్రాణాలతో బయటపడినట్లు కన్నీరు మున్నీరయ్యారు. మూడు నెలలుగా కంపెనీ జీతాలు చెల్లించడం లేదని, పస్తులుంటున్నామని, ఇక ఇక్కడి నుంచి వెళ్లి పోతున్నామని హరీశ్‌రావు బృందానికి వివరించారు.

ఇందుకు హరీశ్‌రావు స్పందించి లేబర్ కమిషనర్‌తో మాట్లాడి మీ డబ్బులు మీకు అప్పగించడంతోపాటు కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకునేలా చూస్తానని హామీ ఇచ్చారు.

కార్మికులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, బీఆర్‌ఎస్ బృందం

14 నెలల్లో నాలుగు ప్రాజెక్టులు కూలాయి..

రేవంత్ సర్కారు హయాంలో 14 నెలల్లో నాలుగు ప్రాజెక్టులు కూలాయని హరీశ్‌రావు అన్నారు. ఖమ్మం జిల్లాలో పెద్దవాగు కొట్టుకు పోయింది.. సుంకిశాల కుప్పకూలింది.. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన వట్టెం రిజర్వాయర్ పంప్‌హౌస్ నీట మునిగింది.. ఇప్పుడేమో ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ కూలిపోయిందని ధ్వజమెత్తారు. మీ ప్రభుత్వం ఏం చేస్తుందని ఆయన ప్రశ్నించారు. ఓవైపు శ్రీశైలం ఖాళీ అవుతుంటే ప్రభుత్వం మొద్దునిద్ర పోతుందని దుయ్యబట్టారు. ఏపీలోని ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు నుంచి నీటిని కొల్లగొడతున్నా.. అడిగే నాథుడే లేడని ధ్వజమెత్తారు. కృష్ణా నీటిని అక్రమంగా తరలిస్తుంటే కేఆర్‌ఎంబీతో ఎందుకు మాట్లాడం లేదన్నారు. మీకు బాధ్యత లేదా..? అని నిలదీశారు. ప్రతిపక్షంలో ఉన్న తాము నిలదీస్తే తప్పా మీకు సోయి లేకుండా పోయిందన్నారు. మాకు రాష్ట్ర ప్రయోజనాలు పట్టవు.. ప్రజల సంక్షేమం పట్టదు.. అని విమర్శించారు. అన్నిట్లో ఈ ప్రభుత్వం ఫెయిల్ అయ్యిందన్నారు.

సహాయక చర్యలు చేపడుతున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బలగాలు

కదిలిన సర్కారు

- ఆరు రోజుల తర్వాత రెస్క్యూ ఆపరేషన్
- టన్నెల్‌లో నిర్విరామంగా సహాయ చర్యలు
- ఎస్‌ఎల్‌బీసీ నుంచి డీవాటరింగ్ ప్రారంభం
- టీబీఎంను కట్ చేసి బురదను బయటికి తీసి
- చిక్కుకున్న వారిని రక్షించేందుకు చర్యలు

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఎట్టకేలకు రేవంత్ ప్రభుత్వం కదిలింది. దోమలపెంట సమీపంలోని శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్‌ఎల్‌బీసీ) టన్నెల్‌లో కార్మికులు చిక్కుకొన్న ఆరు రోజుల తర్వాత రెస్క్యూ ఆపరేషన్‌లో వేగం పెంచారు. మాజీ మంత్రి హరీశ్‌రావుతోపాటు బీఆర్‌ఎస్ బృందం రావడంతో మంత్రులు, అధికారులు నిర్విరామంగా సహాయక చర్యలు చేపట్టారు. ఎస్‌ఎల్‌బీసీ నుంచి డీవాటరింగ్ ప్రారంభించారు. టన్నెల్ బోరు మోటర్‌ను కట్ చేసి బురదను బయటికి తీసే పనుల్లో వేగం పెరిగింది. చిక్కుకుపోయిన టీబీఎం మిషన్‌ను రైల్వే శాఖకు చెందిన భారీ ప్లాస్మా కట్టర్లను తీసుకొచ్చి కట్ చేస్తున్నారు. మరోవైపు పేరుకుపోయిన బురదను లోకో ట్రైన్‌లో బయటకి తొలగిస్తున్నారు. చెల్లాచెదురుగా పడిఉన్న శిథిలాలు బయటకు తీస్తున్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు రాకతో ప్రభుత్వం సొరంగం వద్ద సహాయక చర్యలు పాల్గొంటున్న బృందాలకు స్వయం నిర్ణయాధికారం తీసుకునే వెసులుబాటును కల్పించింది. ఫలితంగా రెస్క్యూ ఆపరేషన్ వేగంగా సాగుతున్నది. ముందుగా 12వ కిలోమీటర్ వద్ద పేరుకుపోయిన బురదను తొలగించి ముందుకు వెళ్తున్నారు. భారీ పంపు మోటర్లతో డీ వాటరింగ్ చేస్తున్నారు. యుద్ధ ప్రాతిపదికన బృందాలు ఏ పనులు చేయాలో ముందే నిర్ణయించుకొని సొరంగమార్గంలో వెళ్లి ఆయా పనులు ముగిస్తున్నారు. తొలగిస్తున్న బురద శిథిలాలను ట్రైన్ ద్వారా బయటికి తీసుకువచ్చి అక్కడ నుంచి పైకి తీసుకువచ్చి డంపు చేస్తున్నారు. సహాయక చర్యలు ఆశాజనకంగా సాగుతూ ఉండడంతో మరికొన్ని గంటల్లోనే చిక్కుకున్న కార్మికుల జాడను తెలుసుకుంటామని ఉన్నతాధికారులు అంటున్నారు. రెండు మూడు రోజుల్లో సహాయక చర్యలు పూర్తి కావచ్చని ఆశాభావంతో ఉండాలి అంటున్నారు. కార్మికులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చేందుకు బృందాలు పగలు, రాత్రి కష్టపడుతున్నారు. టన్నెల్‌లో ఉన్న నీటిని భారీ పంపులతో బయటికి తోడుతున్నారు. లోకో ట్రైన్‌లో అమర్చిన పెద్దపెద్ద కంటైనర్లలో నింపుతున్నారు. సుమారు పదివేల క్యూబిక్ మీటర్ల బురద నిండి ఉంటుందని అంచనా వేస్తున్నారు. బురద తొలగించడం ద్వారా టీబీఎం ముందుభాగం చేరుకుంటామని ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు చెబుతున్నాయి. ఆర్మీ, నేవీ, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్, ర్యాట్ మైనర్స్, దక్షిణ మధ్య రైల్వే ప్లాస్మా కట్టర్స్, రాబిన్సన్ మైనింగ్ ప్రతినిధులు, మెఘా, నవయుగ, కంపెనీల బృందాలు నిరంతరం సమన్వయంతో సహాయక చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ సంతోష్ మీడియాకు వివరించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై రెస్క్యూ టీంలు దృష్టి సారించడంతో తొలగింపు ప్రక్రియ వేగంగా సాగుతున్నట్లు చెప్పారు.

సొంతూళ్లకు కూలీల పయనం..

సొంతూర్లకు వెళ్తున్న కూలీలు

ఎస్‌ఎస్‌బీసీ వద్ద ప్రమాదం జరిగి 8 మంది చిక్కుకుపోవడంతో జార్ఖండ్, పంజాబ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన మిగితా కూలీలు సొంతూళ్లకు వెళ్తున్నారు. ఆరు రోజులుగా ప్రమాదంలో చిక్కుకున్న వారిని బయటకు తీసుకురాకపోవడంలో ప్రభుత్వం విఫలం కావడంతో భయంతో సొంతూళ్ల బాట పట్టారు. ఇక్కడ దాదాపు 200మందికి పైగా కూలీలు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి పనిచేస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు రెండు షిఫ్టుల్లో పనిచేస్తున్నా రోజువారి వేతనం రూ.600 నుంచి రూ.700 మాత్రమే. వీటితోనే వంట వండుకొని తినాలి. తమ కండ్లముందే సహచరులు సొరంగంలో చిక్కుకున్నా బయటకు తీసుకురాలేదని ఆందోళన చెందుతున్నారు. భవిష్యత్‌లో తమకు ఇదే పరిస్థితి రావొచ్చని ముందుగానే బస్సు ఎక్కి వెళ్లిపోయారు. మరో రెండ్రోజుల్లో మిగతా వారు కూడా వెళ్లిపోయే అవకాశం ఉంది.

నిపుణుల సలహాలు తీసుకోలేదు..

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ ఘటన జరగడం దురదృష్టకరమని మాజీ వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. టన్నెల్‌లో ఇరుక్కుపోయిన కార్మికులు, ఇంజినీర్లు క్షేమంగా రావాలని అందరికీ ఉందన్నారు. ఏదైనా ప్రాజెక్టు రూపకల్పన చేసేముందు సత్వర ఫలితాలు ప్రజలకు అందించాలనే తపన పాలకులకు ఉండాలని, ఎస్‌ఎల్‌బీసీ రూపకల్పన జరగడమే లోపభూయిష్టంగా జరిగిందని ఉద్యమ సమయంలో కేసీఆర్, హరీశ్‌రావు అనేక సార్లు చెప్పారని అన్నారు. సంఘటన జరిగినప్పుడు చెప్పడం కాదని శాసనసభలో సీఎంగా ఉన్న కేసీఆర్ చెప్పారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ ప్రాజెక్టుతో సమానంగా మొదలుపెట్టిన ఏపీకి చెందిన పోతిరెడ్డిపాడును ఆగమేఘాల మీద పూర్తి చేస్తారని, ఎస్‌ఎల్‌బీసీ ఎన్నటికీ ఒడవని ముచ్చటగా ఉండాలనే వివక్షను ఆనాడే ఎత్తి చూపామని అన్నారు. ప్రభుత్వంలో వచ్చాక దీనిని ఏమి చేయాలని ఆలోచన చేసినప్పుడు ఆనాడు ఈపీసీ విధానం తెచ్చారని జీవో 147 వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు రూ.2,811కోట్లతో ఈపీసీ కింద చేపట్టాలని నిర్ణయించారన్నారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు హరీశ్‌రావు నేతృత్వంతో దాదాపు 64కిలోమీటర్ల వరకు టన్నెల్‌ను 11.5 డయమీటర్‌తో టన్నెల్‌ను మూడేండ్లలోపు పూర్తి చేశామని అన్నారు. ఈ ప్రభుత్వం 15మాసాలుగా పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు నీళ్లు ఇవ్వాలన్న చిత్తశుద్ధి లేకుండా పనిచేస్తుందన్నారు. ఫలితాలు ఇవ్వడానికి ప్రాజెక్టు సిద్ధంగా ఉందన్నారు. ఈ ఘటనను రాజకీయం చేయదల్చుకోలేదన్నారు. రెండు కొండలమధ్య ప్రమాదం జరిగిన స్థలం కొన్ని దశాబ్దాలుగా గ్యాప్ ఉండడం వల్ల మట్టి, రాళ్లు పేరుకు పోయి లూజ్‌గా ఉండడం వల్ల అక్కడ డ్రిల్లింగ్ జరుగడం వల్ల పడి పోయిందని నిపుణులు చెబుతున్నారన్నారు. ప్రాజెక్టు పునః ప్రారంభానికి ముందు సాంకేతికంగా ముందు జాగ్రత్తలు తీసుకొని పనులు మొదలు పెట్టాలని సూచించారు.

ఓ నేత ఒత్తిడి వల్ల పనులు మొదలుపెట్టారు

- మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి

ఎస్‌ఎల్‌బీసీ పనులు చేపట్టేముందు జియాలజికల్ సర్వే నివేదిక ఆధారంగా పనులు మొదలు పెట్టకుండా ఓ నేత ఒత్తిడి వల్ల ఆదరబాదరగా టన్నెల్ పనులు మొదలు పెట్టారని మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రమాదం జరిగి ఆరు రోజులైనా ఎలాంటి పురోగతి లేదని, మంత్రులు మాత్రం ఫొటోలకు ఫోజులు ఇవ్వడం తప్పా వారు చేసిందేమీలేదన్నారు. మంత్రులు గాలిలో తిరుగుతూ గాలి మాటలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. సీఎం సొంతజిల్లాలో ఇంత పెద్ద ఘటన జరిగి ఆరురోజులైనా ఆయన రావడానికి తీరికలేదా? అంటూ ప్రశ్నించారు. లోపల చిక్కుకున్న కార్మికులు, ఇంజినీర్ల ప్రాణాలను కాపాడాలనే చిత్తశుద్ధి ప్రభుత్వానికి కనిపించడం లేదన్నారు. ఆరురోజుల తర్వాత తట్ట మట్టి బయటకు తీశారన్నారు.

అడుగడుగునా అడ్డంకులు

- ఎస్‌ఎల్‌బీసీకి అనుమతులు ఇచ్చినట్లే ఇచ్చి అవరోధాలు
- భారీగా మోహరించిన పోలీసు యంత్రాంగం
- కార్మికుల సమస్యలు తెలుసుకున్న బీఆర్‌ఎస్ బృందం

పోలీసులు అడ్డుకోవడంతో కింద కూర్చొని నిరసన తెలుపుతున్న హరీశ్‌రావు, నేతలు

అచ్చంపేట, ఫిబ్రవరి 27 : ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో బీఆర్‌ఎస్ బృందానికి అనుమతి ఇచ్చినట్లే ఇచ్చి ప్రభుత్వం అనేక అడ్డంకులు సృష్టించింది. గురువారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు నేతృత్వం లో నల్ల గొండ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ప్రతినిధి బృందం సొరంగ ప్రమాద ఘటనను పరిశీలించి ప్రభుత్వానికి సూచనలు చేయడానికి రాగా, దోమల పెంట సమీపంలోని అటవీశాఖ చెక్‌పోస్ట్ వద్ద వాహనాలను నిలిపివేశారు. హరీశ్‌రావుతో పాటు చెందిన మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి, జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీలు నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి, బీరం, గువ్వల, మాజీ కార్పొరేషన్ చైర్‌పర్సన్, చైర్మన్లు, నాయకుల బృందం భారీ కాన్వాయ్‌తో దోమల పెంటకు చేరుకున్నది. అప్పటికే చెక్‌పోస్టు నుంచి ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ వరకు అడుగడుగునా భారీగా పోలీసు బలగాలు మోహరించాయి. కాన్వాయ్‌ను పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులు, బీఆర్‌ఎస్ బృందం మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది. టన్నెల్‌లోకి వెళ్లడానికి చివరికి ఎనిమిదిమందిని అనుమతి ఇచ్చారు. పోలీసుల వాహనంలో ఎక్కాలని తాము తీసుకెళ్తామని పోలీసులు వాహనం సిద్ధంగా ఉంచారు. అయితే హరీశ్‌రావు వాహనం దిగలేదు. తమ వాహనంలోనే వస్తానని చెప్పడంతో పోలీసులు చేసేదిలేక రెండు వాహనాలలో ఎనిమిదిమందిని అనుమతి ఇచ్చి వెనుక ముందు పోలీసుల వాహనాలతో తీసుకెళ్లారు. నిన్నటి వరకు రెండు చెక్‌పోస్టులు ఉండేవి. బీఆర్‌ఎస్ నేతల కోసం మరో రెండు చెక్‌పోస్టులు అదనంగా ఏర్పాటు చేశారు. మూడు చెక్‌పోస్టుల వద్ద క్షుణ్ణంగా పరిశీలించి లోపలికి అనుమతించారు. లోపల నాలుగో చెక్‌పోస్టు వద్ద మళ్లీ వాహనాలు ఆపి అందులో ఉన్న మాజీమంత్రులు హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, మర్రి జనార్దన్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు కిందికి దింపి వాహనాలను తనిఖీ చేశారు. వెంబడి కెమెరాలు, ఫోన్లు ఉండరాదని ఆంక్షలు విధించారు. కెమెరా వెంట ఉంటే కూడా దింపి బయటకు పంపించేశారు. ఎనిమిది మంది వద్దని కేవలం ఆరుగురే వెళ్లాలని ఆపేశారు. దీంతో ప్రభుత్వ తీరును ఖండిస్తూ హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, గువ్వల బాలరాజు, మర్రిజనార్దన్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డిలు నేలపై కింద కూర్చొని నిరసన వ్యక్తం చేయగా చివరకు అనుమతించారు. టన్నెల్ వద్ద ప్రమాద స్థలిని పరిశీలించిన అనంతరం తిరిగి జేపీ కంపెనీ గెస్ట్ హౌజ్ వద్ద మీడియా పాయింట్ వద్దకు చేరుకున్నారు. కొద్దిసేపటి తర్వాత ఎమ్మెల్సీలు నవీన్‌రెడ్డి, కోటిరెడ్డి, నల్గొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, మాజీ గిడ్డంగుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ రజిని సాయిచంద్‌ల వాహనాన్ని మూడో చెక్‌పోస్టుకు వద్ద నిలిపివేశారు. టన్నెల్‌లోకి అనుమతి లేదని వాహనం అక్కడే నిలిపివేశారు. తాము ఇద్దరం ఎమ్మెల్సీలమని నవీన్‌రెడ్డి, కోటిరెడ్డిలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి వనపర్తి ఎస్పీ గిరిధర్‌తో వాగ్వివాదానికి దిగారు. తనను ఎందుకు నెట్టివేస్తున్నావని, మేము ప్రజల తరఫున వచ్చామని ఎంత చెప్పినా అరగంటపాటు వాదోపవాదాలు చేసుకున్న అనుమతించలేదు. దీంతో వారు ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. ఇలాంటి చిల్లర ప్రభుత్వాన్ని తామెప్పుడూ చూడలేదన్నారు. బీఆర్‌ఎస్ నేతలను చూస్తేనే ప్రభుత్వం భయపడుతుందని పోలీసుల తీరును ఖండించారు. అక్కడ మీడియా పాయింట్ పక్కనే గెస్ట్ హౌజ్‌లో రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విశ్రాంతి తీసుకుంటున్నారని కొందరు మీడియా మిత్రులు హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. మీడియా సమావేశం అనంతరం హరీశ్‌రావు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసేందుకు గెస్ట్ హౌస్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా గేటు వేశారు. తాను మాజీ నీటిపారుదల శాఖ మంత్రిగా, ఏడుసార్లు ఎమ్మెల్యేగా అనుభవం ఉందని కొన్ని సూచనలు, సలహాలు చేసేందుకు మంత్రి ఉత్తమ్‌ను కలుస్తానని చెప్పినా పోలీసులు అనుమతించలేదు. కలువడానికి అనుమతి లేదని అక్కడున్న వనపర్తి ఎస్పీ గిరిధర్‌రావు హరీశ్‌రావు వెళ్లకుండా ఆపేశారు. హరీశ్‌రావు గేటును తోసుకుంటూ వెళ్లే ప్రయత్నం చేసిన పోలీసులు భారీగా మోహరించి ఉన్నారు. బీఆర్‌ఎస్ నేతలుగా మేము రాజకీయం చేసేందుకు రాలేదు. టన్నెల్‌లో పనులు వేగవంతం చేసి, లోపల ఉన్న ఎనిమిది మంది కార్మికుల ప్రాణాలు కాపాడేందుకు తమవంతు కొంత సూచనలు చేసేందుకు కలుస్తామని చెప్పినా పోలీసులు మంత్రి ఉత్తమ్‌ను కలువడానికి అనుమతి ఇవ్వలేదు. ఎస్పీ, బీఆర్‌ఎస్ నేతల మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకున్నది. ప్రభుత్వ తీరు, పోలీసుల ఆంక్షలను హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. బీఆర్‌ఎస్ నేతల పర్యటనను భయపడి ప్రభుత్వం పోలీసుల ద్వారా కట్టడి చేస్తుందన్నారు. మీడియాకు అనుమతి ఇవ్వకపోవడంతో జర్నలిస్టులు నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని మంత్రి ఉత్తమ్ దృష్టికి తీసుకెళ్లినా ఆయన నుంచి స్పందన రాలేదు. ఎండలో నిల్చోకుండా టెంట్ వేసి నీటి సౌకర్యం కల్పించారు.

దళితబంధు నిధులు విడుదల చేయాలి

కొల్లాపూర్ రూరల్, ఫిబ్రవరి 27 : దళిత బంధు రెండో విడుత నిధులు విడుదల చేయాలని కోరుతూ గురువారం స్థానిక అంబేద్కర్ విగ్రహం ఎదుట దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వంలో రెండో విడుత దళిత బంధు పథకానికి ఒక్కొక్క నియోజకవర్గానికి 1100 యూనిట్లకు లబ్ధిదారులు ఎంపిక చేసి నిధులు లబ్ధిదారుల ఖాతాలో వేసినట్లు గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకా సీఎం రేవంత్‌రెడ్డి ఆ నిధులు విడుదల కాకుండా అడ్డుకుని నిధులను హోల్డ్‌లో పెట్టి అడ్డుకున్నారని, అంతే కాకుండా ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్‌కు ఎలాంటి నిధులు కేటాయించలేదని ఆరోపించారు. దళితులపై కాంగ్రెస్‌కు చిత్త శుద్ధి ఉంటే వెంటనే దళితబంధు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మాదిగ దండోరా జిల్లా అధ్యక్షుడు దేవని కుమార్ మాదిగ, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కలమంద శేఖర్, బీఆర్‌ఎస్ విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దార శేఖర్, సుధాకర్, కుమార్, వెంకటస్వామి, శంకర్ పాల్గొన్నారు.

కొల్లాపూర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు

నేడు నాగర్‌కర్నూల్‌కు ఎమ్మెల్సీ కవిత

- సింగోటం లక్ష్మీనర సింహస్వామికి ప్రత్యేక పూజలు

కల్వకుర్తి/కొల్లాపూర్, ఫిబ్రవరి 27 : తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, నిజామాబాద్ ఎమ్మెల్సీ కవిత శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా పర్యటిస్తున్నట్లు కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి కార్యాలయ సిబ్బంది, నాగర్‌కర్నూల్ జిల్లా జాగృతి అధ్యక్షుడు గణేశ్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు ఎమ్మెల్సీ కవిత హైదరాబాద్‌నుంచి బయలుదేరి ఉదయం 9 గంటలకు కొల్లాపూర్ మండలం సింగోటంలో లక్ష్మీనరసింహ స్వామి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయనున్నారు. అనంతరం ఉదయం 10 గంటలకు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని పద్మనాయక వెలమ భవన్‌లో నిర్వహించే బీసీ కుల సంఘాల రౌండ్ టేబుల్ సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కవిత పర్యటనను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు, తెలంగాణ జాగృతి కార్యకర్తలకు వారు పిలుపునిచ్చారు.